

శ్రీవారి సేవలో జస్టిస్ డివై చంద్రచూడ్

ప్రజాశక్తి- తిరుమల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డివై చంద్రచూడ్ బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు, ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు ఈవో ఎవి ధర్మారెడ్డి, ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు శ్రీఆరి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను, పంచగవ్య ఉత్పత్తులను అందజేశారు.



50 ఏళ్లకే బీసీలకు పింఛన్

- చేనేతలకు ప్రత్యేక పాలసీ, టెక్స్‌టైల్ పార్కు
- నగరిలో ప్రతి ఎకరాకూ సాగునీరు
- పలమనేరు, నగరి 'ప్రజాగళం' సభల్లో చంద్రబాబు





ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పలమనేరు

'యాభై ఏళ్లకే బీసీలకు పింఛన్' ఇస్తానని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ ఇచ్చారు. సొంత నియోజకవర్గమైన కుప్పంలో రెండు రోజుల పర్యటన ముగించుకుని బుధవారం ఉదయం పలమనేరు, సాయంత్రం నగరిలో ఎన్నికల సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వస్తే పవర్‌లూమ్స్, చేనేత కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇస్తామన్నారు. నగరిలో టెక్స్‌టైల్ పార్కు తీసుకొస్తామన్నారు. 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్ ఇస్తామన్నారు. రైతులకు అన్నదాత పథకం కింద ప్రతి ఏటా 20వేలు జమ చేస్తూ, డ్రిప్, సబ్సిడీలు ఇస్తూ తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. నేతం సుగర్ ఫ్యాక్టరీ ఇవ్వాల్సిన బకాయిలను వడ్డీతో సహా ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 'దీపం' పథకం కింద ఏడాదికి మహిళలకు మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామన్నారు. బస్సు సౌకర్యం ఉచితంగా కల్పిస్తామన్నారు. అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక తొమ్మిదిసార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లను పెట్టి పేదవాని కడుపు నింపే కార్యక్రమం చేపడతామన్నారు. 'సిద్ధం' బోర్డు పెట్టి అందరినీ మోసం చేస్తున్నారని, మేము ఇపుడు సిద్ధమయ్యాం మిమ్మల్ని ఇంటికి పంపడానికి అని రాయలసీమలో ప్రతి ఒక్కరూ జగన్మోహన్‌రెడ్డిని నిలదీయండి..' అని పిలుపునిచ్చారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా చేస్తానన్నారు. నగరిలో టెక్స్‌టైల్ పార్కు పెట్టి చేనేతలను ఆదుకుంటామన్నారు. వడమాలపేటకు పారిశ్రామికవాడ తీసుకొస్తానన్నారు. నగరిలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామన్నారు. నగరి ఎంఎల్ఎ ఆర్‌కె రోజా ఓ సాటి మహిళకు ఛైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తానని 40 లక్షలు డబ్బు తీసుకున్నారన్నారు. చిత్తూరు ఎంపి అభ్యర్థి దుగ్గిమళ్ల ప్రసాద్‌రావు, పలమనేరు అసెంబ్లీ అభ్యర్థి ఎన్.అమరనాథ్‌రెడ్డి, నగరి అసెంబ్లీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, సత్యవేడు, జీడీనెల్లూరు అసెంబ్లీల అభ్యర్థులు ఆదిమూలం, థామస్, పార్టీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ పాల్గొన్నారు. అక్కడనుంచి అన్నమయ్య జిల్లాకు బయల్దేరి వెళ్లారు. నగరిలో టిడిపి నాయకులు గంజి మాధవయ్య, గాలి జీవరత్నం నాయుడు, చినబాబు, డిజి ధనపాల్, ఎంఎన్ ధనపాల్ పాల్గొన్నారు.

పలమనేరులో మాట్లాడుతూ రైతులకు సబ్సిడీలు అందట్లేదని, బిందు సేద్యం పరికరాలు అందుతున్నాయా? అని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నుంచి రుణాలు అందాయా? అని సభికులను అడిగారు. మీ బతుకుల్లో చీకటి నింపిన వ్యక్తులను గుర్తించాలని, ముసుగు వీరుడు పరదాలు దాటి బయటకు వస్తున్నాడని, జగన్‌కు ఖాళీ వీధులు స్వాగతం పలకాలన్నారు. ఒక్కసీమ ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. టిడిపి హయాంలో 90 శాతం ప్రాజెక్టులను పూర్తిచేస్తే, జగన్ 10శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. ఉమ్మడి చిత్తూరులో 25 ప్రాజెక్టులను జగన్ రద్దు చేశారన్నారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు మేమంతా సిద్ధం అని జనం రాయలసీమకు రాకుండా అడ్డుకోవాలన్నారు. ప్రజాగళాన్ని మొదటగా పలమనేరులో ప్రారంభించానని, పలమనేరు మీటింగ్ సూపర్‌హిట్ అని, ఎక్కడ చూసినా జనమేనన్నారు. రాష్ట్రం కోసం ఎన్‌డిఎలో చేరితే మమ్మల్ని జగన్ విమర్శిస్తున్నాడని, తాము గతంలో ఎన్డీయేలో ఉన్నపుడు మైనార్టీలకు అన్యాయం జరగలేదన్నారు. ఎక్కడ భూములు కనిపించినా వైసిపి నాయకులు వదలట్లేదని, ఆలయ భూములను కబ్జా చేస్తున్నారని, చివరికి ఇళ్లనూ కబ్జా చేసే పరిస్థితి వస్తుందన్నారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా చేస్తానని, బెంగుళూరు, చెన్నయ్ నగరాలను తలపించేలా అభివృద్ధి సాధించే రంగాలను తీసుకొస్తానన్నారు. పలమనేరులో చంద్రబాబు నాయుడు సమక్షంలో పలువురు వైసిపి నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి చంద్రబాబు టీడీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

మీడియా వాహనానికి తృటిలో తప్పిన పెను ప్రమాదం

వి.కోట : కుప్పం నుంచి పలమనేరుకు వెళుతున్న మీడియా వాహనం వి.కోటలో రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. వి.కోట పట్టణ సమీపంలోని ముదిమడుగు గ్రామం నుంచి ట్రాక్టర్ కుప్పం ప్రధాన రహదారిలోకి ఉన్నపళంగా రావడంతో కుప్పం వైపు నుంచి వస్తున్న టెంపో ట్రావెలర్ అదుపు చేయలేక రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టెంపో ట్రావెలర్ డ్రైవర్ తిరుపతికి చెందిన సంజీవ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. హెచ్‌ఎం టివి కెమెరామెన్‌కు గాయాలయ్యాయి. మిగిలిన మీడియా మిత్రులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఢీకొన్న తీవ్రతకు ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఏదిఏమైనా పెను ప్రమాదం తప్పడంతో మీడియా మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు. వి.కోట ఎస్ఐ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతి నుంచి వచ్చిన మీడియా ప్రతినిధులను ఇతర వాహనాల్లో పలమనేరుకు మీటింగ్‌కు తరలించారు.



టిడిపి ఎంపి అభ్యర్థి ప్రసాద్ రావు పరిచయం

చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని చిత్తూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు తెలిపారు. బుధవారం పలమనేరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ప్రజాగళం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రస్తుతం అన్ని విధాలుగా నష్టపోయిందని, ఈ పరిస్థితుల్లో రాష్ట్ర అభివద్ధిపై ప్రత్యేక విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. చిత్తూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావును చంద్రబాబు నాయుడు పలమనేరు వాసులకు ప్రత్యేకంగా పరిచయం చేశారు. వచ్చే ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి ప్రసాద్ రావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబును కలిసిన మండల నాయకులు

బంగారుపాళ్యం: తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును బుధవారం కుప్పంలో మండల తెలుగుదేశం అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, ధరణి మర్యాదపూర్వకంగా కలిశారు.

వెదురుకుప్పం: నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం యాత్రలో భాగంగా బుధవారం ఎస్ఆర్ పురం మండలం 49కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన కొత్తపల్లి సూరిరెడ్డి పుత్తూరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు

ప్రకృతి వ్యవసాయం సరే...!

సిబ్బంది జీతాల సంగతేంటి..?

- 14 నెలలుగా అందక అవస్థలు



జిల్లా మేనేజర్ వాసుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజారోగ్యం కొరకు రసాయన ఎరువుల వాడకం బదులు పూర్తిగా సేంద్రియ ఎరువుల వాడకంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి జిల్లాలో పెద్ద ఎత్తున ప్రాధాన్యతను ఇచ్చింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేలా ప్రకృతి సేద్యం సిబ్బందిని ఏర్పాటు చేసింది. చిత్తూరు జిల్లాలో 235 మంది ప్రకృతి సేద్యం సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రకృతి సేద్యం సిబ్బందికి గౌరవ వేతనం పేరిట నెలకు రూ.14 నుండీ 25 వేల వరకు ప్రభుత్వం అందిస్తోంది. ఇలా అందించే వేతనం 14 నెలలుగా అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ప్రకృతి సేద్యం సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు.

నెలా.. రెండు నెలలు.. సర్దుకుపోవచ్చు ఏకంగా 14నెలల పాటు జీతం ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు, కుటుంబాల పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. కనీసం వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించే సమావేశాలకు సైతం ఇరుగుపొరుగు వారి నుండీ అప్పు తీసుకోవాల్సి వస్తోంది. జీతాలు అడుగుంటే నేడు, రేపు అంటూ 14 నెలలుగా ఇవ్వకుండా దాటవేస్తున్నారు. తక్కువ జీతాలకే పనిచేస్తున్న ప్రకృతిసేద్యం సిబ్బంది బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

గ్రామస్థాయి నుంచి అమలు

ప్రకృతి సేద్యం విస్తరణ పథకంలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఐసిఆర్‌పిలు 172 మంది ఎంసీఏలు ఆరుగురు, యూనిట్ ఇన్‌ఛార్జిలు 57మంది విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ప్రతి రైతు వద్దకు వెళ్ళి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు వారి అవసరమైన విత్తనాలు, ఆర్గానిక్ ఎరువులు, పురుగు మందులు అందించాల్సి ఉంటుంది. గౌరవేతనంపై ఆధారపడి పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి 14 నెలలుగా జీతాలు రాకపోవడంతో రవాణా ఖర్చులకు సైతం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది.

ప్రజారోగ్యం సరే.. క్షేత్రస్థాయి సిబ్బంది కథేమిటి..?

ప్రకృతి సేద్యం పథకాన్ని జిల్లాలోని 159 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 183 గ్రామ పంచాయతీలకు చెందిన 173 గ్రామాల్లో అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 36వేల మంది రైతులతో 32,200 ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని విస్తరించారు. ఈ ఏడాది 39,349 మంది రైతుల ద్వారా 58,849 ఎకరాల్లో ప్రకృతి సేద్యం పెంచాలనేది లక్ష్యం. ఇందు కోసం జిల్లాలో క్షేత్రస్థాయి సిబ్బంది 235 మంది పనిచేస్తున్నారు. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రకృతి సేద్యం ప్రోత్సహించడం సరే.. క్షేత్రస్థాయి సిబ్బందికి ఇచ్చే గౌరవేతనం నెలనెలా చెల్లించకుంటే క్షేత్రస్థాయిలో ఎలా పనిచేయాలో ప్రకృతి వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం ఆలోచించాలి. జిల్లాలో ప్రకృతి సేద్యం క్షేత్రస్థాయి సిబ్బందికి నెలకు రూ.43లక్షలు గౌరవవేతనం కింద చెల్లించాల్సి ఉంటుంది. గత ఏడాది ఫిబ్రవరి నుండీ అంటే 14 నెలలుగా వేతనం అందలేదు.. ఈ లెక్కన రూ.6.02కోట్లు క్షేత్రస్థాయి సిబ్బంది వేతన రూపంలో చెల్లించాల్సి ఉంది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బంది వేతనాలు దారిమళ్లించారనే ఆరోపనలున్నాయి. ఫలితంగానే 14నెలలు వేతనాల బకాయిలున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలను చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంఘం ఏర్పాటు..

వేతన బకాయిలు ఇతర సమస్యలతో సతమతమౌతున్న సిబ్బంది సిఐటియు నేతృత్వంలో సంఘం ఏర్పాటు చేసుకున్నారు. వేతనాలతో పాటు వ్యవసాయ అనుబంధశాఖ ప్రకృతి సేద్యంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యల పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రకృతి సేద్యం క్షేత్రస్థాయి సిబ్బంది సంఘం నాయకులు భారతి, ప్రతాప్‌లతో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసుకు వినతిపత్రం అందజేశారు. రవాణా ఖర్చులకు కూడా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని, 14 నెలల వేతన బకాయిలను చెల్లించేలా చూడాలని కోరారు. ప్రాజెక్టు మేనేజర్ స్పందిస్తూ సిబ్బంది సమస్యలను, వేతన బకాయిలను గురించి ప్రభుతం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.


వారు ఎటుంటే... అటే గెలుపు

- నియోజకవర్గంలో యాదవ, ముస్లింలదే హవా..
- అభ్యర్థులకు తెలీని ఓటరు నాడి.. !
- డబ్బు, మద్యం ప్రభావం చూపుతుందా.. లేక
- నిజాయితీ, అభివృద్ధికి పట్టం కడతారా..!

ప్రజాశక్తి- పుంగనూరు

పుంగనూరు నియోజకవర్గంలో 2024 జరగబోవు శాసనసభ ఎన్నికల్లో గెలుపు ఓటములు యాదవ, ముస్లిం సామాజిక వర్గాలపై ఆధారపడి ఉంటుంది. ఏ పార్టీ ప్రచారానికి వెళ్లిన మా ఓటు మీకే అంటూ ఓటరు చెప్పడంతో అభ్యర్థులు ఎవరికి ఓటు వేస్తారని ప్రశ్న తలెత్తుతోంది. మరోవైపు పార్టీ అభ్యర్థులు ఇచ్చే తాయిలాలకు ఓటు వేస్తారా.. లేక నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి ఓటు వేస్తారా.. డబ్బు, మద్యం ప్రభావం ఏమైనా చూపుతోందా, నీతి నిజాయితీకి పట్టం కడతారా అని పలు సందేహాలతో ప్రసుత్తం అభ్యర్థుల్లో తలెత్తుతున్నాయి.

నియోజకవర్గంలో యాదవులు, ముస్లిం మైనారిటీలు, మహిళలే ఏ పార్టీ గెలవాలి, ఏ పార్టీ ఓడిపోయాలో నిర్ణయించే స్థాయిలో ఉన్నారు. యాదవ ఓటర్లు సుమారు 28వేలు, ముస్లిం ఓటర్లు సుమారు 35వేలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనాలు. నియోజకవర్గంలో అత్యధిక శాతం వీరే.. వీరు ఎవరికైతే ఓటు వేస్తారో వారు గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే గతంలో యాదవ సామాజికవర్గం ఎక్కువగా తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలుపుతూ ఓటు వేసేవారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత కొంత భాగం వైసీపీ వైపు మొగ్గు చూపడం జరిగింది. 2019లో జరిగిన ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున బోడె రామచంద్ర యాదవ్ పోటీ చేయగా సుమారుగా 16వేలు ఓట్లు సాధించాడు. వీటిలో ఎక్కువ భాగం యాదవ సామాజిక వర్గం వారు ఓట్లు వేశారని అప్పట్లో చర్చ నడిచింది. యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి భారత చైతన్య యువజన పార్టీని కొత్తగా స్థాపించడంతో బోడె రామచంద్ర యాదవ్ పుంగనూరు శాసనసభ్యులుగా పోటీలో దిగుతున్నారు. కాగా మైనారిటీ ఓట్లు ఎక్కువ శాతం వైసీపీకి పడే అవకాశం ఉండగా, ఎస్‌డిపిఐ (సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా) పార్టీ తరపున మైనార్టీలు అభ్యర్థి నిలబెట్టనున్నట్లు పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదే జరిగితే ఎస్‌డిపిఐ పార్టీ పోటీలో ఉంటే నియోజకవర్గంలో ముస్లిం ఓట్లు చీలే అవకాశాలున్నాయి.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
చల్లా రామచంద్రారెడ్డి
బోడె రామచంద్ర యాదవ్

పుంగనూరు మండలంలో నేతిగుట్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు కోసం ఆ ప్రాంత రైతులు నుండి 876 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. సుమారు 10 గ్రామాలకు సంబంధించిన రైతులు భూములు పోగొట్టుకున్నారు. వారికి ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం అందలేదు. నేతిగుట్లపల్లి, దిగువ చింతవారిపల్లి, ఆవులవారిపల్లి, అరంట్లపల్లి, కమ్మవారిపల్లి, పట్టుపల్లి తండా మరో కొన్ని గ్రామాలకు చెందిన రైతులు నేతిగుట్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు భూములు కోల్పోయారు. ఈ ప్రాంత వాసులంతా తమకు డబ్బు కాదు, బంగారు ఇచ్చినా వైసీపీకి ఓటు వేయమని కరాకండిగా చెబుతున్నారు. ఈ ప్రాంత ఓట్లు బిసివైపికి లేక తెలుగుదేశం పార్టీకి పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. యాదవ సామాజిక వర్గంలో వైసిపిలో ఒకరిద్దరుకు పదవులు ఇచ్చారు కానీ యాదవులను చిన్నచూపు చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే పరిస్థితి చౌడేపల్లి మండలంలోను కొనసాగుతున్నది.

బోయకొండ అభివృద్ధి మండలి ఛైర్మన్ యాదవ సామాజికవర్గానికి కేటాయించాలని అప్పట్లో పలువురు కోరారు. అయితే పుంగనూరు మండలంకి చెందిన రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడంతో చౌడేపల్లి మండలంలో యాదవ సామాజిక వర్గం అంతా వైసీపీలో వ్యతిరేక భావనలు కనిపిస్తున్నాయి. యాదవులపై పట్టుసాధించాలని నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనలతో యాదవ గర్జన సభను ముడ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో యాదవ నాయకులను పిలిపించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సభను విజయవంతంకి కృషి చేశారు. నియోజకవర్గంలో యాదవులు ముస్లింలు తరువాత కాపులు ఉన్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు కూటమి మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థిని కాపులు బలపరుస్తారా లేక వైసిపి పార్టీకి ఓటు వేయడం జరుగుతుందా అనే చర్చ మాత్రం నియోజకవర్గంలో నడుస్తుంది. నియోజకవర్గంలో యువత మాత్రం కొంతమేరకు జనసేన పార్టీకి మద్దతు తెలుపుతున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డి, వైసిపి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బీసీవైపు బోడె రామచంద్ర యాదవ్, ఎస్‌డిపిఐ పార్టీలో పోటీలో నిలవనున్నాయి. పుంగనూరు నియోజకవర్గం నాలుగు పార్టీలు అసెంబ్లీ ఎన్నికలకు తలపడుతున్నారు.

నిర్దేశించిన సమయంలో క్లైమ్స్ పరిష్కారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్దిష్ట కాలపరిమితిలో క్లైమ్‌లను, వచ్చిన ఫిర్యాదులను పరిష్కారం చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. క్లైమ్‌లకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో స్పందించి తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని, ఈఎస్ఎంఎస్ ద్వారా ఇప్పటివరకు 36లక్షలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులను బృందాలను పంపి పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు సంబంధించి నివేదిక పంపడం, ఏర్పాట్లను పరిశీలించడం, ప్రచారానికి సంబంధించి అనుమతులు ఆన్లైన్ ద్వారానే ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు మరింతగా అవగాహన కల్పించే కార్యక్రమం చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన చర్యలు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేయడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఏసీబీ వలలో ఆర్ఐ

రూ.12,500లు స్వాధీనం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఏసీబీ దాడుల్లో ఆర్ఐ రెడ్డప్పను అదుపులోకి తీసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ తెలిపారు. బుధవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా పట్టాదారు పాసుపుస్తకం మార్పు కోసం కార్వేటినగరంలోని ముస్లిం కాలనీకి చెందిన షేక్ మహ్మద్ఫ ఆర్ఐ రెడ్డెప్పను అభ్యర్థించగా ఆర్ఐ రూ.12,500లు డిమాండ్ చేసినట్లు తెలిపారు. పేదరికంతో జీవనం గడుపుతున్న షేక్ మహ్మద్ రఫీ నగదు చెల్లించుకోలేమని వేడుకున్నా అందుకు ఆర్ఐ నగదు ఇచ్చాకే పట్టాదారు పాసుపుస్తకం సిద్ధం చేస్తామని చెప్పడంతో దిక్కుతోచని రఫీ ఏసీబీ అధికారులను సంప్రదించారు. దీంతో బుధవారం ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి రఫీకీ రూ.12.500 నగదును ఇచ్చారు. రఫీ ఏసీబీ ఇచ్చిన నగదును ఆర్ఐ రెడ్డెప్పకు ఓ టీ దుఖాణం వద్ద అందజేశారు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వెంటనే ఆర్ఐని అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు.అతనిపై కేసు నమోదు చేసి నెల్లూరు జిల్లా ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, ఏసీబీ అధికారులు ఉన్నారు.



ఏసీబీకి చిక్కిన ఆర్ఐ రెడ్డప్ప


ఎలక్షన్ ఎటకారం

ఇంతకీ ఎవ్వరు గెలుస్తారబ్బా..!

(సామాన్యుడి సణుగుడు)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఎలచ్చన్లు...ఎలచ్చన్లు.. అంటా ఉండినాము ఒచ్చేసినాయి ...క్యాండేట్లు ఎవురు ఎవురు అనుకుంటా ఉండినాము... క్యాండేట్లు ఒచ్చేసినారు... ఇప్పుడు ఎవురు గెలుస్తారు... ఎవురు గెలుస్తారు అనుకుంటా ఉండారు. క్యాండేట్ల కన్నా జనాలకి ఆ ఇది ఎక్కువైపోయింది. రూలింగ్ పార్టీ ఓళ్ళు నవరత్నాలు... నవరత్నాలు అని బటన్ నొక్కతా ఉండారు... సరే బటన్ నొక్కినాక దుగ్గాళ్ళు పడక పోయినా ఎప్పుడో ఒకప్పుడు ఒచ్చినాయిలే... మేము అన్ని ఆమీలు చేసేసినామ్ అని చెప్తా ఉండారు... రోడ్లు.. గీడ్లు.. బిల్డింగులు... కాలవలు.. సెరువులు.. ఏమీ కట్టకపోయా... అదేమంటే మాది సంచేమ పెభుత్వం అని చెప్తా ఉండిరి. పెతిపచ్చం ఓళ్లు సూపర్ సిక్స్ అంటా ఉండారు. నవరత్నాలు కన్నా బాగుంటాయని సూపర్ సిక్స్ అని పెట్టినారాంట.. సిక్స్ తిరగేస్తే 9 ...9 తిరగేస్తే సిక్స్.. జనాల్ని నమ్మించేదానికి ఈ ఇదంగా జేస్తా ఉండారు. రాష్ట్రానికి ఓదా తెస్తాము... పోలారం పూర్తి జేస్తాము... కాలువలు తెప్పిస్తాము...తాగేదానికి నీళ్లు ఇస్తాము... రోడ్లు ఏస్తాము... సదువుకున్న పిలకాయలకి ఉజ్జోగాలిస్తాము... ఆంధ్రని జపాన్ జేస్తాము... సింగపూర్ జేస్తాము అని చెప్పడంలే... నవరత్నాలు... సూపర్ సిక్సులు... జనాలు ఇంకేం పని లేదు అనుకుంటా ఉండారు.. జనాలు జనాల గురించి అనుకోవడం లే... ఆలోచించడం లే... రాజకీయ నాయకుల మాదిరితో ఆలోసిస్తూ ఉండారు.. ఈ ఇదంగా ఉంటే ఎవురు గెలుస్తారు... రాజ"కీయం" గెలస్తాది. జనాలు ఈ ఇసయం తెల్సుకోవాల.... యాం తెలుసు కుంటారో యాందో....



శ్రీవారి సేవలో రాంచరణ్ దంపతులు

ప్రజాశక్తి -తిరుమల

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన శ్రీవారిని బుధవారం వేకువజామున దర్శించుకున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా సుప్రభాత సేవలో సతీమణి ఉపాసన, కూతురు క్లింకారతో కలిసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందించారు. రాత్రి తిరుమలకు చేరుకున్న రామ్ చరణ్ దంపతులు పద్మావతి నగర్ లోని ఫోనిక్స్ వెంకటేశ్వర నిలయంలో బస చేశారు. రామ్ చరణ్ ను చూసేందుకు అప్పటికే భారీగా అభిమానులు తిరుమలకు చేరుకున్నారు. సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు.



తిరుపతిలో 'ఆరణి' ప్రచారం

దూరంగానే టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

జనసేన - టిడిపి - బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు బుధవారం తిరుపతిలో తన ప్రచారాన్ని ప్రారంభించారు. కపిలతీర్థం సర్కిల్ నుంచి జీవకోన వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. నవజీవన్ కాలనీలో గంగమ్మ గుడిలో, జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఇంటింట ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ చిరంజీవి 2009లో జీవలింగేశ్వర స్వామి ఆశిస్సులు పొంది ప్రచారం ప్రారంభించారని, అదే బాటలో తాను ఇంటింటి ప్రచారం ప్రారంభించానన్నారు. జీవకోనలో ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డి అభివృద్ధి పేరుతో అబద్దాల ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం అమృత స్కీం నిధులు తప్ప, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఒక్క రూపాయి డివిజన్‌లో ఖర్చుచేయలేదన్నారు. జీవకోనలో ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను పరిష్కరించడంలో ఎంఎల్ఎ విఫలమయ్యారన్నారు. రానున్న ప్రభుత్వంలో డివిజన్‌లోని ఇళ్లపట్టాల క్రమబద్ధీకరణ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కొందరి వల్ల జీవకోనకు చెడ్డపేరు వస్తోందని, తిరుపతి నగరంలో ఏ మూల నేరాలు జరిగినా జీవకోనలో పోలీసులు సోదాలు చేస్తున్నారన్నారు. గంజాయి అమ్మకాలను ఎంఎల్ఎ, ఆయన కుమారుడు ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి అమ్మకందారులను శిక్షించి జీవకోనలో ప్రశాంత వాతావరణం నెలకొల్పుతానన్నారు. నగర కార్పొరేషన్ ఛైర్మన్‌ను డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి డమ్మీగా మార్చారన్నారు. జీవకోనలో నిర్మించిన రెండు మాస్టర్‌ప్లాన్‌రోడ్లకు ప్రభుత్వ అనుమతులు లేవని, ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. టిడిఆర్ బాండ్ల పేరుతో ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డిలు దోచుకున్న డబ్బును కక్కిస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు గాజు గ్లాసుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మోహన్, సూరా సుధాకర్ రెడ్డి, ఎల్బీ సుధాకర్ రెడ్డి, కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అయితే టిడిపి ప్రధాన నాయకత్వం, జనసేనలో కొంతమంది కూటమి అభ్యర్థి ప్రచారంలో ఎక్కడా కానరాలేదు.



సుగుణమ్మ పరిస్థితే పనబాక లక్ష్మికి..


రెండు స్థానాలిస్తానని ఒక్కటీ లేదు / 'పొత్తు'తో తిరుపతిలో తీవ్ర నిరాశ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జనసేన, బిజెపితో టిడిపికి పొత్తు ఏళ్ల తరబడి పార్టీలో సీనియర్లుగా ఉండి, టిక్కెట్ ఆశించి, ప్రతిపక్షంలో ఉండి అధికారపక్షంపై తిరగబడిన వారిని నిరాశ పరచింది. తిరుపతి మాజీ ఎంఎల్ఎ ఎం.సుగుణమ్మ పరిస్థితికి భిన్నంగా ఏమీ లేదు మాజీ మంత్రి పనబాక లక్ష్మి కూడా. చంద్రబాబును నమ్ముకుంటే నట్టేట ముంచేశాడని పనబాక దంపతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని సమాచారం. తిరుపతి ఉప ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎన్నికల బరిలో దిగితే ఓటమి తప్పదని తెలిసిన అధిష్టానం మాట ధిక్కరించలేదన్న విషయాన్ని వారు అనుచరగణంతో చెప్పుకుని బాధపడుతున్నారు.

కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పనబాక కుటుంబం ఓ వెలుగు వెలిగింది.. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పనభాక లక్ష్మి కేంద్రమంత్రిగా పనిచేశారు. ఆమె భర్త పనబాక కష్ణయ్య గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గంలో అభివద్ధి కార్యక్రమాలు చేశారు.. తెలుగుదేశం పార్టీలో చేరిన తర్వాత వారి ప్రతిష్ట మసకబారిందని ఆమె అనుచరులు చెబుతున్నారు.. టిడిపిలో రెండు సీట్లు ఇస్తానని చంద్రబాబు మాటిచ్చారట.. అయితే బిజెపితో పొత్తులో భాగంగా ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడంతో పనబాక దంపతులు చంద్రబాబుపై కన్నెర్ర చేస్తున్నారట.. 1991లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన పనబాక లక్ష్మి.. నెల్లూరు పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు ఆమె.. కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉన్న పనబాక దంపతులు.. 2014లో జరిగిన రాజకీయ పరిణామాల అనంతరం 2021 లో తెలుగుదేశం పార్టీలో చేరారు..

అప్పట్నుంచి పార్టీ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేస్తూ వచ్చారు.. అయితే సుళురుపేట అసెంబ్లీ టికెట్ తో పాటు తిరుపతి ఎంపి టికెట్లు ఇస్తానని చంద్రబాబు పనబాక దంపతులకు మాటిచ్చారట.. చివరిదాకా ఎదురుచూసిన రెండు స్థానాలు దక్కకపోవడం పై పనబాక కుటుంబం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై తీవ్ర అసంతప్తితో ఉన్నారట.. ఇతర పార్టీల్లోనూ దారులు మూసుకుపోవడంతో రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పనబాక లక్ష్మి అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట.. చంద్రబాబును నమ్ముకుంటే నట్టేట ముంచేసాడని తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది.



నివేదికలు, రికార్డులు సక్రమంగా ఉండాలి : జెసి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల నిర్వహణకు సంబంధించి రోజువారి నివేదికలు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల 2024లో భాగంగా బుధవారం డిఆర్‌డిఎ పీడీ సమావేశం హాల్‌లో డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలసి ఎన్నికలలో నోడల్ ఆఫీసుర్లు నిర్వహించవలసిన బాధ్యతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ 2024 ఎన్నికలలో భాగంగా ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ రావడం జరిగిందని అప్పటి నుండి జిల్లా ఎన్నికల నోడల్ ఆఫీసుర్లు టీమ్స్‌కు సంబంధించిన రిపోర్ట్స్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏ రోజుకు సంబంధించిన నివేదికల రిపోర్ట్స్‌ను అదే రోజు సంబంధిత ఆర్ఓ ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలన్నారు. నోడల్ ఆఫీసర్లకు కేటాయించిన సహాయక సిబ్బంది తప్పనిసరిగా నోడల్ ఆఫీసర్లతో పాటుగా ఉండాలన్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించండి: ఎంపిడిఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేష్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: వేసవి దృష్ట్యా మండలంలో ఎక్కడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రాజేష్ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో తాగునీటిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేటట్లు చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఈవో పిఆర్‌డి రాజేంద్ర బాలాజీ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య ఉత్పన్నమైన వెంటనే సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చి సత్వరం సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాబోవు రెండు నెలలు గ్రామాలలో తాగునీటికి ఎటువంటి సమస్యలు రాకుండా పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్డబ్ల్యుఎస్ ఏఈ. లోకనాథం మాట్లాడుతూ గ్రామపంచాయతీకి సంబంధించిన తాగునీటి బోర్లలో జలాలు అడుగంటితే ప్రత్యామ్నాయంగా సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బియం మండల కో - ఆర్డినేటర్ సురేష్ బాబు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ర్యాలీలు, ప్రచారాలకు

48 గంటల ముందే అనుమతి తీసుకోవాలి: జెసి


ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలకు నిర్వహణకు సంబంధించి 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శీనివాసులు పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఏఆర్ఓ డాక్టర్ జె.అరుణ, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డిలతో కలసి నోడల్ ఆఫీసుర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలకు నిర్వహణకు సంబంధించి 48 గంటల ముందే ఆర్ఓ నుండి పర్మిషన్ పొందిన తర్వాతనే సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకోవలన్నారు. పర్మిషన్లు పొందినా కూడా నిబంధనల ప్రకారంగానే రాజకీయ పార్టీలు ర్యాలీలకు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు సి విజిల్ యాప్ ద్వారా ఎన్నికల వైలేషన్‌కు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చునని, ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత టీమ్ అక్కడికి వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు ప్రచారంలో భాగంగా లౌడు స్పీకర్లు ద్వారా ఎక్కువ సౌండ్ వస్తుందని ప్రజల నుండి ఫిర్యాదులు అందాయని, లౌడు స్పీకర్లుతో ఎక్కువ సౌండ్ కలిగించే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 16 నుండి ఏప్రిల్ 17వ తేదీ వరకు అయిన ఖర్చులను సంబంధిత పార్టీలకు ఖాతాలకు జమచేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఈనెల 16 నుండి అన్ని టిమ్స్ రిపోర్ట్స్‌ను అప్ డేట్ చేయాలన్నారు. ఎన్నికల పరిశీలకు వచ్చిన తర్వాత వారు అన్ని రికార్డులను పరిశీలించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల టీమ్స్‌కు సంబంధించి రిపోర్ట్స్‌ను ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుకు నెట్వర్క్, వీల్‌ఛైర్స్ సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈసమావేశంలో గుడిపాల, చిత్తూరు తహశీల్దార్లు, విజయలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, ఎంపిడిఓలు రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నోడల్ ఆఫీసురులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో 'ఓటరు చైతన్య కార్యక్రమాలు'



నోడల్ టీం అధికార్ల సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ద్వారా ఓటరు చైతన్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా చేపట్టాలని ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ స్వీప్ నోడల్ టీమును ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై నోడల్ టీం అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాలను పోలింగ్ బూత్ స్థాయిలో చేపట్టాలన్నారు. కొత్తగా ఓటు హక్కునమోదు చేసుకున్న యువ ఓటర్లు, మహిళలు, వద్ధులకు ఓటు హక్కు ప్రాధాన్యత, నైతికంగా ఓటు హక్కు వినియోగం, ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక, అతి సమస్యత్మక ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటర్లను చైతన్యపరిచేలా వివిధ కార్యక్రమాలను రూపొందించి, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన పెంచాలన్నారు. 'నేను తప్పకుండా ఓటు వేస్తాను' అనే స్వీప్ సందేశాన్ని ఓటర్లలోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చేపట్టబోయే స్వీప్ కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి, కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన స్వీప్ అవగాహన కార్యక్రమం

విద్యార్థులకు ఓటు హక్కు, ఓటు విలువ పైన అవగాహన కల్పిస్తూ స్థానిక చిత్తూరు విజయం డిగ్రీ కళాశాలలో జరిగిన స్వీప్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు డిఎంకె తులసి విచ్చేశారు. ఈ సభను ఉద్దేశించి డిఆర్‌డిఎ పిడి తులసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సివిజిల్, ఓటర్ హెల్ప్ లైన్, సాక్ష్యం యాప్‌ల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటు పైన చైతన్యం కల్పించే లఘు చిత్రాలను విద్యార్థులకు చూపించారు. జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్, జేడిఎం సరితా రెడ్డి, విజయం కాలేజీ కరస్పాండెంట్ రాజగోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పిడి తులసి

కాంగ్రెస్ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- వికోట: రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధించాలంటే అది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని పలమనేరు కాంగ్రెస్ పార్టీ ఆశావాహ అభ్యర్థి శివశంకర్ తెలిపారు. మండల కేంద్రమైన వికోటలో బుధవారం కాంగ్రెస్ పార్టీ యువనేత శివశంకర్ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రత్యామ్నాయ పార్టీ కోసం ఎదురుచూస్తున్నారని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అందర్నీ కలుపుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నేతలు ఇనయ తుల్లాఖాన్, నాగరాజు, శివన్న, గురువిరెడ్డి, విక్కి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలి: రాకేష్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. నింద్ర షుగర్ ఫ్యాక్టరీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద పూజలు నిర్వహించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పిసిసి జనరల్ సెక్రెటరీ ఆర్.బాబు, నటరాజ్ మలియార్, చిరంజీవి రెడ్డి, దేశయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ డాక్టర్ థామస్



ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఎస్ఆర్.పురం మండలంలోని జిఎంఆర్.పురం గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. థామస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం కోటపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్సీ భరత్ తరపున ఆయన భార్య ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒకసారి తన భర్తకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకొని వెళ్తామని ఆమె గడపగడపకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. జడ్పిటిసి కృష్ణమూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: విజయానంద రెడ్డి అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని చిత్తూరు జిల్లా వైసిపి మాజీ మహిళా అధ్యక్షురాలు గాయత్రి దేవి తెలిపారు. స్థానిక ప్రశాంత్ నగర్‌లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

ఎన్నికల కోడ్ అమలు చేయాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని రాగిమానుపెంట, కీరమంద, కొదలమడుగు, టేకుమంద సచివాలయాలను బుధవారం ఎంపిడివో తనిఖీ చేశారు. అనంతరం కోదల మడుగులో ఏర్పాటుచేసిన తనిఖీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అన్ని వాహనాలను తనిఖీ చేపట్టాలని, ఎన్నికల నియమావళిపై అందురు అవగాహనతో ఉండాలన్నారు. అలాగే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నగదు, వస్తువులు తరలిస్తుంటే వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్, రమేష్, పోలీసులు రమేష్ బెనర్జీ, అస్గర్, రామ్మూర్తి పాల్గొన్నారు.

రబ్బర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: సుందరరాజుపురంకు సమీపంలో గల ఎస్పీ రబ్బర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంబవించింది. మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ సుందరరాజుపురం దగ్గర్లో ఎస్పీ రబ్బర్ ఫ్యాక్టరీలో పాత టైర్లను పొడి చేసి తద్వారా వ్యాపారం సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఫ్యాక్టరీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడ్డ షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పు పక్కనుండే గడ్డిపై పడటంతో మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో టైర్ల పొడి ఫ్యాక్టరీలో సిద్ధంగా ఉన్న మూటలు, పాతటైర్లు కాలడంతో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటాన్ని స్థానికులు గుర్తించి వెంటనే ఫైరింజన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో చిత్తూరు ఏడీఎఫ్‌వో కరుణాకర్, హెడ్ కానిస్టేబుల్స్ సురేష్, బాబు, కానిస్టేబుల్స్ బాలాజీ, సతీష్‌లు ఫైరింజన్‌తో తరలివచ్చి మంటలను అదుపు చేశారు. అయితే ఎస్పీ రబ్బర్ ఫ్యాక్టరీలో జరిగిన నష్టంపై వివరాలు పోలీసులకు, ఫైరింజన్ అధికారులకు ఫ్యాక్టరీ యజమాని ఫిర్యాదు చేయలేదని అధికారులు తెలిపారు.

ఎంపీ సమక్షంలో వైసీపీలో చేరికలు..!

ప్రజాశక్తి -రామకుప్పం: మండలంలోని రెడ్డివారిపల్లి, చింతమానత్తం, సింగసముద్రం గ్రామాల నుంచి బుధవారం పలువురు ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఎంపీ, ఎమ్మెల్సీ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... సీఎం జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమలను చూసి ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, చలపతి, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి- పూతలపట్టు: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పది పరీక్షలు బుధవారంతో ముగిసాయి. పూతలపట్టు మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో 532 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. బండపల్లి పరీక్షా కేంద్రాన్ని సీఐ సుదర్శన ప్రసాద్ తనిఖీ చేయగా పోలవరం, పి కొత్తకోట, పూతలపట్టు, పరీక్షా కేంద్రాన్ని ఎర్రచెరువు పల్లి పరీక్ష కేంద్రాలను ఎంఈఓ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు.

శ్రీదేవి కళావేదిక అధ్యక్షులు రాజశేఖర్‌కు అవార్డు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతిలో అంతర్జాతీయ సాంస్కృతిక, సాహితీ, సంగీత కార్యక్రమం కళావేదిక ఇంటర్నేషనల్ చైర్మన్ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద స్వరగానం కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఐరాల మండలం గుట్టకిందపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు, గాయకులు, కళాభిమాని, శ్రీదేవి కళావేదిక అధ్యక్షులు జీను రాజశేఖర్ పాల్గొని పల్లె జానపద గీతాలు ఆలపించారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు సన్మానించి అవార్డును అందజేశారు.

మాజీ మంత్రిని కలిసిన గౌహతి రెడ్డి



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం పేట గ్రామంలో మాజీ మంత్రి గల్లా అరుణ కుమారిని జిల్లా వైసీపీ మహిళా కార్యదర్శి గౌహతిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సొంత గ్రామమైన పేటమెట్టలో వరదరాజుల స్వామి ఆలయంలో మండల పూజలు కార్యక్రమంలో భాగంగా గల్లా అరుణ కుమారిని ఆహ్వానించినట్టు ఆమె తెలిపారు.

'సి' విజిల్ యాప్ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సీ విజిల్ యాప్, ఈఎస్ఎంఎస్ ఫిర్యాదులు, ఎంసిఎంసి ఫిర్యాదుల పరిష్కారం, సన్నద్ధత తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా రాష్ట్ర సచివాలయం సిఇఒ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర అధికారులతో కలిసి పాల్గొన్నారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు గడువులోపు పరిష్కరించేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జేసీ నోడల్ అధికారులతో మాట్లాడుతూ నోడల్ అధికారులందరూ సమన్వయంతో వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. డిఆర్ఒ పెంచల్ కిషోర్ పాల్గొన్నారు.

జనసేన ఇన్‌ఛార్జిగా వినుత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జిగా కోట వినిత నియమితు లయ్యారు. మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత పవన్ కళ్యాణ్ బుధవారం నియామక పత్రం అందజేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి వినుత శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. మళ్లీ ఆమెనే కొనసాగిస్తూ పవన్ కళ్యాణ్ నియామక పత్రం అందజేశారు. జనసేన పార్టీలో వీర మహిళగా మొక్కవోని ధైర్యంతో వినుత శ్రీకాళహస్తి ప్రజల తరపున పోరాడుతున్నారు.

బర్డ్‌కు మరో ఆధునిక మణిహారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు వేగంగా అందిస్తున్న బర్డ్ ఆసుపత్రికి బుధవారం రూ.కోటి విలువచేసే అత్యాధునిక కత్రిమ అవయవాల తయారీ యంత్రాలను సేలంకు చెందిన దాత బాల సుబ్రమణ్యం విరాళంగా అందించారు. బర్డ్ ఆసుపత్రిలో బుధవారం పూజలు నిర్వహించి దాత బర్డ్ ప్రత్యేకాధికారి డా.రాచపల్లి రెడ్డప్పరెడ్డికి అందజేశారు. దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని డా.రాచపల్లి రెడ్డప్పరెడ్డి కోరారు.

వైసిపిని ఆశీర్వదించండి : మేరిగ మురళీధర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేరిగ మురళీధర్ ప్రచారం చేశారు. స్థానిక నాయకుల, కార్యకర్తల ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనన్ని సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి సమర్థవంతంగాఅమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి శ్రీనివాసులు, నాగులు, సురేష్ రెడ్డి, గిరిబాబు, కోదండ రామయ్య, సాయి హాషీమ్, పూర్ణ, అశోక్, బాలు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి : విసి



ప్రజాశక్తి - క్యాంపస్: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వంగిమల్ల శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంఎక్స్‌ప్లోర్ 2024 కార్యక్రమాన్ని బుధవారం కళాశాలలోని సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రస్తుత తరుణంలో వస్తున్న నూతన పోకడలు ఆధునిక పరిజ్ఞానం పరిశోధనల పట్ల ఆసక్తిని, అభిరుచిని కలిగి పట్టుదలతో నిరంతర అధ్యయనం చేయాలని సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ కు మనోవిజ్ఞాన శాస్త్ర అంశాలతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్ వి ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన అంశాలను శిక్షణ కార్యక్రమాలను అవగాహన చేసుకుని వినియోగించుకోవాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య దామోదర్ రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ దివాకర్ రెడ్డి, కన్వీనర్ ఆచార్య హేమ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని పొగురుపల్లి, కే.గొల్లపల్లి, చింతలపాలెం, కోట, చెంబగిరి, ఒంటిపల్లి గ్రామాలపరిధిలో గురువారం 33/11కెవి దాసమానుపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ నియంత్రణ సామర్థ్యం 5 యంవిఏ నుండి 8 యంవిఏ పెంచడం కొరకు పనులు చేపట్టడం వలన ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని రెస్కో ఎండి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.